క్లుప్తంగా

మార్నింగ్ వాక్ ప్రారంభం



అవగాహన కల్పిస్తున్న పోలీస్

ఇల్లందకుంట: సిరిసేడు గ్రామంలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి పర్యవేక్షణలో జమ్మికుంట రూరల్ సీఐ, ఇల్లందకుంట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ప్రాముఖ్యం, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. గ్రామస్తులు స్పందించి సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.60వేలు అందజేయడం అభినందనీయమని అన్నారు.

బీసీలు ఏకం కావాలి



మాట్లాడుతున్న తిరుపతిగౌడ్

చిగురుమామిడి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేంతవరకు సామాజిక ఉద్యమానికి బీసీలు ఏకం కావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాల్లపల్లి తిరుపతిగౌడ్ కోరారు. శనివారం చిగురుమామిడిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లు అమలైతే సీఎం రేవంతర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందనే అక్కసుతో బీజేపీ, బీఆర్ఎస్ తమ వైఖరిని వెల్లడించలేదన్నారు. బీసీ సంక్షేమ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు గుడిసె మల్లికార్జున్, సోషల్ మీడియా కన్వీనర్ గుజ్జుల రాజు, నాయకులు గంగుల లింగం, బండారిపల్లి రాజు, సందబోయిన పర్శరాములు, సాయి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



జమ్మికుంట: పట్టణంలో మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా శాఖ సహాయ కార్యదర్శి ఎస్.అచ్యుత్‌కుమార్ ఆధ్వర్యంలో మనవ హక్కుల సదస్సు పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈనెల 12న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలగోపాల్ ఆలోచన విధానం, కార్యాచరణపై స్మారక సదస్సుకు అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కమిటీ సభ్యులు చైతన్య, సదానందం, ప్రశాంత్, ఏసుబాబు, సమ్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు



గంగాధర: బూర్గుపల్లి పంచాయతీ బొమ్మకంటిపల్లి గ్రామానికి వెళ్లే రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురయింది. గుంతలమయమై రోడ్డుపై వెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. సమస్యను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రోడ్డు మరమ్మతు చేయించారు.

బోరు మోటార్ ప్రారంభం

శంకరపట్నం: కన్నాపూర్ గ్రామంలో ఎంపీ నిధులతో వేసిన బోరు మోటార్‌ను శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ప్రారంభించారు. జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి, నరేందర్, అశోక్, సంపత్, రాజిరెడ్డి, వీరార్జున్, రవి, రమణారెడ్డి, పోచయ్య, భూమయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

శంకరపట్నం: రోడ్డు ప్రమాదంలో చిలువేరి రాజేశ్ మరణించగా.. అతడి స్నేహితులు చేయూతనందించారు. రాజేశ్ చిన్న కూతురు నిత్యశ్రీ పేరిట రూ.52వేలు తపాలా కార్యాలయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. శనివారం కుటుంబ సభ్యులకు పత్రాలను అందజేశారు. గొర్ల అనిల్, బండ శ్రీనివాస్, నూనె రవి, నూనె శ్రీనివాస్, మోతె శంకర్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేయాలి

శంకరపట్నం: సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో అక్రమాలపై విచారణ చేయాలని బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి రాసమల్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంపేట గ్రామానికి చెందిన కేతిరి శ్రీనివాస్‌రెడ్డి, చింతం తిరుపతి పేరిట మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను వారికి ఇవ్వకుండా ఇతరుల ఖాతాలో జమ చేయడంపై అధికారులు విచారణ చేయాలన్నారు.

విస్తరిస్తున్న కోళ్ల పరిశ్రమ

- యువ రైతుల ఆసక్తి
- వ్యవసాయ రంగానికి అనుబంధం
- వేధిస్తున్న లేబర్ కొరత



మాదాపూర్‌లో బాయిలర్ కోళ్ల పెంపకం

గన్నేరువరం: వ్యవసాయ అనుబంధ రంగమైన కోళ్ల పరిశ్రమ రోజురోజుకు విస్తరిస్తోంది. మాంసానికి డిమాండ్ పెరుగుతుండడంతో వీటి పెంపకం చేసే వారి సంఖ్య పెరుగుతోంది. సాధారణంగా రైతులు మాంసం కోసం బాయిలర్ కోళ్లను వాణిజ్యపరంగా పెంపకం చేస్తూ ఉంటారు. అయితే వ్యవసాయ రంగంలో ఇబ్బందుల్లో ఉండడంతో అనుబంధంగా కొత్తగా కోళ్ల పరిశ్రమపై రైతులు దృష్టి సారిస్తున్నారు. మండలంలో లేయర్, బాయిలర్ కోళ్ల పరిశ్రమను ఎక్కువ మంది ఎంచుకోవడంతో విస్తరిస్తోంది. సొంతగా వ్యవసాయ భూములున్నా ఏర్పాటు చేసుకునే అవకాశముంటుంది. లేయర్ అర ఎకరం నుంచి ఆపైన, 5వేల బాయిలర్ కోళ్ల పెంపకానికి 10 నుంచి 15 గుంటలు, 10వేలైతే ఆపైన భూమి అవసరముంటోందని రైతులంటున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలో సుమారు 4లక్షల వరకు లేయర్, 36వేల వరకు బాయిలర్ కోళ్ల పెంపకాలు జరుగుతున్నాయి. గుండ్లపల్లిలో లక్ష కోళ్ల లేయర్ కోళ్లఫాం, గోపాల్‌పూర్ లక్ష, మాదాపూర్‌లో 50వేలు, పీచుపల్లిలో 50వేలు, పారువెల్లలో 50వేలు, మైలారంలో 20వేలు, ఖాసీంపేటలో 20వేలతో లేయర్ కోళ్లఫాంలు స్థానికులు ఏర్పాటు చేసుకున్నారు. బాయిలర్ కోళ్లఫాంలు ఖాసీంపేటలో 5వేలతో వేర్వేరుగా రెండు, మాదాపూర్‌లో 10వేలు చొప్పున వేర్వేరుగా రెండు, చొక్కారావుపల్లె, యాస్వాడలో 6వేలతో ఒక్కోటి ఉన్నాయి. ఇవే గాక జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన షెడ్డుల్లో 100 నుంచి 1,000 లోపు కోళ్ల పెంపకాలు చాలా గ్రామాల్లో ఉన్నాయి. గతంలో గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు తీసుకొని నిర్మాణం చేపట్టేవారు. ప్రస్తుతం సుడా పరిధిలో ఉండడంతో కోళ్లఫాంల ఏర్పాటుకు అనుమతులు ఆలస్యమవుతున్నాయని అంటున్నారు. లేకుంటే మరికొన్ని కోళ్లఫాం నిర్మాణాలు జరిగేవని పేర్కొంటున్నారు.

యువత ఆసక్తి..

కోళ్ల పరిశ్రమపై యువ రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మాదాపూర్‌లో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, పీచుపల్లిలో తిరుపతిరెడ్డి, ఖాసీంపేటలో ఏలేటి మల్లారెడ్డి లేయర్ కోళ్ల పెంపకం చేపట్టారు. బాయిలర్ కోళ్ల పరిశ్రమలో ఖాసీంపేటలో ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, సింగిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి, చొక్కారావుపల్లెలో గన్నేరువరం గ్రామ మాజీ ఉప సర్పంచ్ బూర వెంకటేశ్వర్లు, మాదాపూర్‌లో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బోడ శ్రీనివాస్‌రెడ్డి, యాస్వాడలో గువ్వల తిరుపతి ఏర్పాటు చేశారు.

పెరిగిన మాంసం ధరలు

ప్రస్తుతం మార్కెట్ చికెన్ ధరలు భారీస్థాయిలో పెరుగుతున్నాయి. దీంతో ప్రస్తుత తరుణంలో బాయిలర్ పరిశ్రమకు మంచి లాభాలు వస్తున్నాయి. గతంలో చికెన్‌కు కిలోకు రూ.200 నుంచి రూ.230 వరకుండగా.. ప్రస్తుతం రూ.240–260 వరకు విక్రయిస్తున్నారు. కాగా కోళ్లఫాం నుంచి ప్రస్తుతం కిలో కోడికి రూ.90 నుంచి 100 వరకు ఫాం రేట్‌కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. లేయర్ కోళ్లఫాంలకు సంబంధించి కోడి గుడ్ల ధరలు ఫాం రేట్ ప్రస్తుతం రూ.4.80 ఉందని కోళ్ల పెంపకదారులు తెలిపారు. గతంలో రూ.5.70 ఉందని పేర్కొంటున్నారు.

లేబర్ కష్టాలు

కోళ్లఫాంలు లేయర్, బాయిలర్‌కు సంబంధించిన లేబర్ కష్టాలు వేధిస్తున్నాయి. బాయిలర్ కోళ్ల షెడ్డులో పని చేయడానికి ఒక జంట భార్యభర్తలుంటే రూ.15వేల నుంచి రూ.17వేలు చెల్లిస్తున్నట్లు కోళ్ల ఫాంల యాజమానులంటున్నారు. ఉచితంగా బియ్యం, గ్యాస్, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. ఒక బ్యాచ్ కోళ్ల పెంపకం అనంతరం మరో బ్యాచ్ వరకు లేబర్ ఉండడం లేదని వాపోతున్నారు. ఒక్కో కోళ్లఫాం యజమానులు 2 నుంచి 4 నెలల వరకు షెడ్లను ఖాళీ ఉంచుతున్నారు.

నిరుద్యోగులకు మంచి అవకాశం



కోడి పిల్లలను తీసుకొచ్చిన నుంచి కోళ్లను విక్రయించేవరకు 45 రోజులు సమయం పడుతోంది. దాన, మెడిసిన్, ఇతర పనులు చేపడితే మంచి లాభాలను ఆర్జించొచ్చు. 8 ఏళ్ల క్రితం 5,500 బాయిలర్ కోళ్ల పెంపకానికి షెడ్డు నిర్మాణాన్ని చేపట్టా. యువత, నిరుద్యోగులకు ఇది మంచి అవకాశం.

– సింగిరెడ్డి లక్ష్మీకాంతరెడ్డి, ఖాసీంపేట

లేబర్ కష్టాలు



కరోనాతో ప్రైవేట్ స్కూల్ నడపడం కష్టంగా మారండతో 6వేల బాయిలర్ కోళ్ల పెంపకానికి షెడ్డు నిర్మాణాన్ని చేపట్టా. ఈ పరిశ్రమ నిరుద్యోగులకు మంచి అవకాశమే కాని.. లేబర్ కష్టాలు అధికంగా ఉంటున్నాయి. లేబర్ అందుబాటులో లేకపోవడంతో షెడ్డులో 2 నెలలైనా కోడి పిల్లలను వేయలేకపోయా.

– బూర వెంకటేశ్వర్లు, గన్నేరువరం

వ్యవసాయానికి అనుబంధంగా..

వ్యవసాయానికి అనుబంధంగా 5,500 కోళ్లను పెంచేలా వ్యవసాయ పొలంలో షెడ్డు నిర్మాణం చేపట్టా. ఏడేళ్ల క్రితం దీనిని చేపట్టిన. సంవత్సరానికి 6 బ్యాచ్‌లు. ఒక్కో బ్యాచ్‌కు ఖర్చులు పోను రూ.50వేల వరకు మిగులుబడి ఉంటుంది. దీనిద్వారా అదనపు ఆదాయం పొందుతున్నా.

– బోడ శ్రీనివాస్‌రెడ్డి, మాదాపూర్



చిగురుమామిడి: మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా దుర్గామాత మండపం ముందు ఐదు విద్యుత్ లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. వీటిని ఆఫ్ చేసేందుకు పంచాయతీ హెల్పర్ ప్రయత్నం చేసినా అవి ఆఫ్ కావడం లేదని స్థానికులు చెప్పారు. స్థానికంగా ఉండే జూనియర్ లైన్‌మెన్, లైన్‌మెన్లు కూడా పట్టించుకోకపోవడం కొసమెరుపు. ఇంకా గాంధీ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు వీధి లైట్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు వెలుగుతున్నాయి.

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

రాష్ట్రస్థాయి డ్రామా పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

కొత్తపల్లి: భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం కళాభారతిలో జరిగిన జిల్లా స్థాయి డ్రామా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఎల్.అక్షంతరెడ్డి, వై.అక్షర, కె.అనిబికా, వై.హర్షిత్, కె.యశ్వంత్‌ను శనివారం పాఠశాలలో అభినందించి మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పర్యావరణ పరిరక్షణ పద్ధతుల గురించి సమగ్రంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని కరీంనగర్ డెయిరీ



ఫ్లెక్సీలో లేని సీఎం ఫొటో

తిమ్మాపూర్: పాడి రైతుల కలయికతో ఏర్పడిన కరీంనగర్ డెయిరీలో ప్రొటోకాల్ పాటించరా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నల్లగొండలోని కరీంనగర్ డెయిరీలో నూతనంగా ఏర్పాటు చేసిన 1.50లక్షల కెపాసిటీ గల కర్డు ప్లాంట్‌ను శనివారం ప్రధాన మంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. డెయిరీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో లేకపోవడం చర్చనీయాంశమైంది. డెయిరీ చైర్మన్ రాజేశ్వరరావు ప్రొటోకాల్ పాటించలేదని విమర్శలు వెల్లువెత్తాయి. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఫొటోతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి ఫొటోలు మాత్రమే దర్శనమిచ్చాయి. ఫ్లెక్సీలో సీఎం ఫొటో లేదని విలేకరులు చైర్మన్‌ను ప్రశ్నించగా.. సీఎం ఫొటో తప్పనిసరి ఏం కాదని సమాధానమిచ్చారు.

అందరికి ఆమోదయోగ్యంగా ఉండాలి



మంత్రి సంజయ్‌కి ప్రతులను అందజేస్తున్న ఉదయ్

గన్నేరువరం: మండలం నుంచి కరీంనగర్ వరకు మానేరు వాగుపై నిర్మించే బ్రిడ్జి అందరికి ఆమోదయోగ్యంగా, అత్యంత చేరువగా ఉండాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ అన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శనివారం కరీంనగర్‌లోని వారి నివాసంలో కలిసి బ్రిడ్జి నిర్మాణాన్ని బలపరుస్తూ గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజలు చేసిన సంతకాల ప్రతులను అందజేసినట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల చిరకాల కల నెరవేరి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ బ్రిడ్జి విషయంలో కొంతమంది స్థానిక, నియోజకవర్గస్థాయి నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసి నిధులు దుర్వినియోగం కాకుండా నిర్మాణం జరిగేలా చూడాలని మంత్రిని కోరామన్నారు.

పీఎం ధన్, ధాన్య పథకం ప్రారంభం



ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న అధికారులు, రైతులు

జమ్మికుంట: పట్టణంలోని పత్తి మార్కెట్ హాల్‌లో మార్కెట్ చైర్‌పర్సన్ పూల్లూరి స్వప్నసదానందం, కేవీకే ఆధ్వర్యంలో పీఎం ధన్, ధాన్య యోజన పథకం, అపరాల స్వావలంబన మిషన్ ప్రారంభ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా అధికారులు, రైతులు శనివారం వీక్షించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం, రైతులు అడ్తిదారులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థరైటిస్ నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

కరీంనగర్‌టౌన్: ఆర్థరైటిస్‌ను నిర్లక్ష్యం చేస్తే నడవలేని స్థితికి చేరి ప్రమాదకరంగా మారుతుందని మెడికవర్ ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రాకేశ్ అన్నారు. వరల్డ్ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకొని శనివారం మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మోకాళ్లు, తుంటి, భుజాలు, మణికట్టు వంటి కీళ్ల నొప్పులు ఆర్థరైటిస్ లక్షణాలన్నారు. వ్యాయామ లోపం, అధిక బరువు, ఒత్తిడి కారణంగా యువతలో కూడా ఆర్థరైటిస్ పెరుగుతుందని తెలిపారు. తొలిదశలో గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే కీళ్ల దెబ్బతినడం నివారించవచ్చని సూచించారు. తగిన బరువును కాపాడుకోవడం, ప్రతిరోజూ తేలికపాటి వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి నియంత్రణలో ఉంటుందని తెలిపారు. వ్యాధి ముదిరితే జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జరీ చేసుకోవాలన్నారు. శస్త్రచికిత్స ద్వారా ఆర్థరైటిస్ రోగులు సాధారణ జీవితం గడపవచ్చని వెల్లడించారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో క్రిటికల్ కేర్ నిపుణులు ఉపేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న శ్రీరామ్‌శ్యామ్

జమ్మికుంట: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ డా.శ్రీరామ్ శ్యామ్ అన్నారు. శనివారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈటల మాటలను ద్వంద్వ అర్థాలు తీస్తూ వక్రబుద్ధితో మాట్లాడడం బాధాకరమన్నారు. జిల్లా ఫిషరీష్ మాజీ చైర్మన్ బోయిన నారాయణ, మహేశ్, వెంకటేశ్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



గాయపడ్డ మొండయ్య

రామడుగు: రామడుగుకు చెందిన అనుపురం మొండయ్య అనే గీత కార్మికుడు శనివారం సాయంత్రం తాటి చెట్టుపై నుంచి పడడంతో తీవ్ర గాయాలపాలైనట్లు గీత కార్మికులు తెలిపారు. తాటి వనంలో తాటి చెట్టు ఎక్కుతుండగా.. అదుపు తప్పిన మొండయ్య చెట్టుపై నుంచి పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. మొండయ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు.


సన్‌షైన్‌లో ఉచిత డయాలసిస్ శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు

కరీంనగర్‌టౌన్: నగరంలోని సన్‌షైన్ ఆస్పత్రిలో 100 మంది కిడ్నీ బాధితులకు ఉచిత డయాలసిస్ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆసుపత్రి సీఈవో డాక్టర్ టి.సురేశ్‌కుమార్ తెలిపారు. శనివారం ఉచిత డయాలసిస్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఐఎంఏ ఎథిక్స్ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జగన్మోహన్‌రావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శైలజ, జనరల్ సెక్రెటరీ డాక్టర్ మహేశ్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సన్‌షైన్ ఆస్పత్రి మేనేజర్ సంపత్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి, పిచ్చి మొక్కలతో క్రీడాప్రాంగణాలు



కేశవపట్నంలో..

శంకరపట్నం: తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణాలు పచ్చి గడ్డి, పిచ్చి మొక్కలతో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ స్థలం కేటాయించి స్వాగత తోరణం ఏర్పాటు చేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడామైదానాలుండగా.. అప్పటి ప్రభుత్వం గ్రామీణ క్రీడాప్రాంగణాలను నిర్మించడంతో విద్యార్థులు, యువత క్రీడలు ఆడేందుకు ఉపయోగపడుతుందని భావించారు. ఎంపిక చేసిన అధికారులు వినియోగంలోకి తీసుకురావడంపై శ్రద్ధ పెట్టకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.

బకాయిలు చెల్లించాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో నాయకులు

గంగాధర: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ బకాయిలు వెంటనే విడుదల చేసి సంబంధిత పాఠశాలలు యధావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్కూల్ యాజమాన్యాలకు బిల్లులు రాకపోవడంతో దసరా తరువాత పాఠశాలకు పిల్లల ప్రవేశం నిలిపేశారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వం స్పందించకుంటే మంద కృష్ణమాదిగ దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు.

హుజూరాబాద్: బెస్ట్ అవైలబుల్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ ఆజాద్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రేవంత్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదివే 25వేలకు పైగా విద్యార్థులకు సంబంధించి రూ.180కోట్ల బకాయిలను ప్రభుత్వం 2 సంవత్సరాల నుంచి విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశముందన్నారు.

కేదార్‌నాథ్ ఆలయంలో యంత్ర పూజ



గన్నేరువరం: మైలారం గ్రామ శ్రీభ్రమరాంబ స్వయంభు మల్లికార్జునస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కేదార్‌నాథ్ ఆలయాన్ని కమిటీ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. శ్రీగిరి ప్రదక్షిణం, ద్వాదశ జ్యోతిర్లింగాల నిర్మాణంలో భాగంగా శివ యంత్రాన్ని పూజించి ప్రతిష్ఠ చేస్తామన్నారు. ఆలయ చైర్మన్ వరాల పర్శరాములు, నూకల తిరుపతి, వైస్ చైర్మన్ జక్కనపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

శుభ్రమైన చేపలు విక్రయించాలి



ప్రారంభిస్తున్న పింగిళి రమేశ్ తదితరులు

జమ్మికుంట: ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన చేపల అమ్మకాలు సాగించాలని కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్ అన్నారు. పట్టణంలో విలాసాగర్ గ్రామానికి చెందిన గరిగంటి సురేశ్ ఏర్పాటు చేసిన లైవ్ ఫిష్ మర్చంట్‌ను శనివారం ప్రారంభించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



శ్రీనివాస్(ఫైల్)

సైదాపూర్: మండలంలోని గుజ్జులపల్లి గ్రామానికి చెందిన రైతు పూదరి శ్రీనివాస్(40) అప్పులబాధతో ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాలు.. పూదరి శ్రీనివాస్ తనకున్న 3 ఎకరాల భూమితో పాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి పంటలు సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్నేళ్లుగా వ్యవసాయంలో నష్టం వచ్చింది. సుమారు రూ.5 లక్షల అప్పు అయింది. ఇంటి నిర్మాణానికి మరో రూ.15 లక్షలు అప్పు కాగా, ఎలా తీర్చాలని మనోవేదనకు గురయ్యాడు. ఈ నెల 9న ఉదయం 10.30 గంటలకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. అనంతరం సోదరుడు శ్రీకాంత్, సన్నిహితులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే శ్రీనివాస్‌ను చికిత్స కోసం హుజూరాబాద్, జమ్మికుంట ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వ్యక్తి..

శంకరపట్నం: ముత్తారంకు చెందిన కనకం రవి(43) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. రవి ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకున్నాడు. కొన్ని మాసాలుగా ఈఎంఐ చెల్లించకపోవడంతో మద్యానికి బానిసై ఈనెల 2న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పతికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యం కేసు నమోదు



నాగరాజు(ఫైల్)

జమ్మికుంట: ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కాలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోగా.. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రామకృష్ణ శనివారం రాత్రి తెలిపారు. కోరపల్లి గ్రామానికి చెందిన తాటికంటి నాగరాజు అనే యువకుడు డిగ్రీ చదువుకున్నాడు. ఆర్మీలో అన్ని పరీక్షలు పాసై ఇంప్రెషన్ విషయంలో రిజెక్ట్ అయ్యాడు. ఆవేదనతో ఏ పని చేయకుండా ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఫోన్ ఇంట్లో పెట్టి ఎవరికి చెప్పకుండా బయటకెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకీ తెలియలేదని యువకుడి తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం: మెట్‌పల్లి గ్రామంలో శనివారం మోటార్‌సైకిల్, కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయికుమార్‌కు తీవ్ర గాయాలు కాగా.. 108 ఈఎంటీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు.